


ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేదెప్పుడో..?



మూడేళ్లుగా విడుదల చేయని ప్రభుత్వాలు

ఆందోళనలో కళాశాలల యాజమాన్యాలు

విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి

జిల్లాలో కోట్లాది రూపాయలు పెండింగ్

ఉపకార వేతనాలదీ అదే దారి

మంచిర్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలల్లో విద్య అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ (బోధనా రుసుం) విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ళుగా ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ప్రభుత్వం అందజేసే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు అర్హతగల విద్యార్థులకు ఉచిత విద్యాబోధన చేస్తున్నాయి.

ఇందుకుగాను బోధనకు అయ్యే ఖర్చులన్నీ యాజమాన్యాలు భరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తే చేసిన అప్పులతోపాటు తమ ఖర్చులకు ఇబ్బందులు ఉండవని సంవత్సరాల తరబడి వేచి చూస్తున్నాయి. అయినా ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడు దల కాగానే తిరిగి డబ్బు వాపసు ఇస్తామని చెబుతున్నాయి.

సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు

ప్రభుత్వం అందజేసే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై ఆధారపడి జూనియర్, డిగ్రీ విద్యను పూర్తి చేసుకొని సర్టిఫికెట్ తీసుకోవలసిన విద్యార్థులు బకాయిలు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో ఆ డబ్బు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని, ప్రభుత్వం నుంచి నిధులు రాగానే చెల్లించిన డబ్బు వాపసు చేస్తామని యాజమాన్యాలు చెబుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం విద్యాసంస్థల జేఏసీ ఆందోళనకు దిగేందుకు సిద్ధమై ప్రభుత్వానికి నోటీసులు కూడా అందజేసింది.

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే ఫస్ట్ ఇయర్ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని టీజేఏసీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వం వెంటనే ఈ నిధుల చెల్లింపుపై దృష్టి సారించి తమ చదువులకు ఆటంకం లేకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

రూ. 40.02 కోట్ల మేర బకాయిలు

జిల్లాలో 2020-21 నుంచి 2023-24 వరకు మూడు సంవత్సరాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ విద్యార్థులు 20 వేల వరకు ఉండగా, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రూ.40.02 కోట్ల రూపాయల వరకు బకాయిలు పేరుకుపోయాయి. బీసీ సంక్షేమ శాఖ ద్వారా బీసీ విద్యార్థులకు రావలసిన బకాయిలు రూ.20.86 కోట్లు ఉన్నాయి. ఈ బకాయిలు ఇలా ఉండగానే కొత్తగా చేరుతున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. మైనారిటీ కేటగిరీ కింద ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.4.81 కోట్లు మంజూరు కావలసి ఉంది. ఎస్సీ సంక్షేమ శాఖలో రూ.8.31 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎస్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ.5.85 కోట్ల బకాయిలు ఉన్నాయి. మూడేళ్లుగా ఈ బకాయిలన్నీ పేరుకుపోగా ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో అధ్యాపకుల వేతనాలు చెల్లించి, కళాశాలలు నడిపించడం కష్టంగా మారిందని ప్రైవేట్ యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బకాయిల్లో సగ భాగం నిధులు విడుదల అయినట్లు పేర్కొని ఏడాది కావస్తున్నా విద్యార్థుల ఖాతాల్లో మాత్రం ఆ నగదు జమ కాలేదు. దీంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారు.

ఇబ్బందుల్లో యాజమాన్యాలు

నర్సయ్య, తెలంగాణ ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో ఒకప్పుడు 14 డిగ్రీ, జూనియర్ కళాశాలు ఉంటే... ప్రస్తుతం 5 చొప్పున మిగిలాయి. దీనికి కారణం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడమే. ప్రభుత్వ కళాశాలల్లో డేటా సైన్స్, ఫుడ్ సైన్స్, డైరీ సైన్స్, బీబీఏ తదితర కోర్సులు అందుబాటులో లేవు. ప్రైవేటులో మాత్రమే ఉన్నాయి. కళాశాలలు ఎత్తి వేయడంతో విద్యార్థులు ఆ విభాగాల్లోని విద్యకు దూరమవుతున్నారు. ప్రైవేటులో బస్సుల వెసలుబాటు ఉండటం వల్ల విద్యార్థులు ప్రైవేటు విద్యపై మొగ్గు చూపుతారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్,ఉపకార వేతనాలు విడుదల చేయడం ద్వారా కళాశాలలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



పాల్గొన్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12: ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను గురువారం జిల్లా కేంద్రంలో బీజేవైఎం నాయకులు దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్‌గాంధీ ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. భారతదేశ కీర్తిని కించపరిచేలా వ్యాఖ్యానించిన రాహుల్‌గాంధీని దేశ ప్రజలు క్షమించరన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. అమీర్, రాజు, సత్యనారాయణ, అశోక్, సుమన్, వెంకటేష్, చిరంజీవి, సురేష్, రాకేష్, అజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వందే భారత్‌కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలి



రైల్వే జీఎంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12: సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ మధ్య ఈ నెల 15న ప్రారంభమయ్యే వందేభారత్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్,మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతలు గురువారం హైద్రాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతి పత్రం అందించారు. వందే భారత్ హాల్టింగ్ జాబితాలో జిల్లాలో ఒక్క రైల్వేస్టేషన్‌కు కూడా హాల్టింగ్ లేకపోవడంతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి రోజు వేల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారని తెలిపారు. మంచిర్యాలలో రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

పార్టీ సభ్యత్వానికి అనూహ్య స్పందన

మందమర్రిటౌన్, సెప్టెంబరు 12: బీజేపీ సభ్యత్వానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాద్, దుర్గం అశోక్‌లు తెలిపారు. గురువారం మందమర్రిలో వారు మాట్లాడుతూ పట్టణంలోని 42 బూత్‌లలో సభ్యత్వం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. కుమారస్వామి, ఆరుముల్ల పోశం, అందుగుల శ్రీనివాస్, వేణు, అక్కల రమేష్ రవి, దీక్షితులు, రాజమల్లు, రాజేందర్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 12: ఊరు మందమర్రి మినీ ట్యాంక్ బండ్ చెరువులో అక్రమ నిర్మాణాలను చేపట్టారని, వాటిని తొలగించాలని బీఎస్పీ నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముల్కల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చెరువు ఎఫ్‌టీఎల్ గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. దాదాపు పది ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని, దీంతో చెరువు నీరు ఇండ్లలోకి వస్తుందన్నారు. హైడ్రా తరహాలోనే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలన్నారు. రాయలింగు, శ్రీనివాస్, విశ్వనాద్ పాల్గొన్నారు.

కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన న్యాయాధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి

నెన్నెల, సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముకేష్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు, సిలబస్ అంశాలను తెలుసుకున్నారు. సమస్యలను తెలిపితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జడ్జి పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ఎస్‌వో పట్టించుకోవడం లేదని గుర్తించామన్నారు. రాత్రి పూట విద్యార్థులతోపాటు హాస్టల్‌లో ఉండాల్సిన ఎస్‌వో లేకపోవడంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

నేరాల అదుపునకు కఠినంగా వ్యవహరించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 12: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపునకు కఠినంగా వ్యవహరించాలని డీసీపీ భాస్కర్ అన్నారు. గురువారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, గంజాయి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. పోచమ్మ చెరువు వద్ద వినాయక నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. ఏసీపీ రవికుమార్, సీఐ దేవయ్య, కుమారస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వర సర్వే

మందమర్రిరూరల్, సెప్టెంబరు 12: మండలంలోని చిర్రకుంట గ్రామంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సర్వేను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. కార్యదర్శులు వీరేందర్, విద్యాలత, శిరీష ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం

బెల్లంపల్లి, సెప్టెంబరు 12: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన వినాయకున్ని గురువారం నిమజ్జనానికి తరలించారు. డప్పుచప్పుళ్ల మధ్య తీసుకువెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. శాంతిఖని గనిపై ప్రతిష్టించిన వినాయకుడిని శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలి

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 12: విద్యుత్ మీటర్లు అవసరమున్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం బూదాకలాన్ గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సీఎండీ ఆదేశాల మేరకు రూ.938కే విద్యుత్ మీటర్లు అందిస్తామన్నారు. జీరో బిల్లు రాని వినియోగదారులు ఈనెల 17న జరిగే ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డీఈ రాజన్న, ఏఈ రాంమనోహర్, శ్రీనివాస్ ఉన్నారు.

వేమనపల్లి: గృహ అవసరాల వినియోగం కోసం రూ. 938కే విద్యుత్ మీటర్‌లు అందజేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఎల్ఎం ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15లోపు విద్యుత్ కనెక్షన్‌లు లేని వారందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సుంపుటం గ్రామంలో మాజీ సర్పంచు బాపు ఆధ్వర్యంలో 20 మందికి కనెక్షన్‌లు అందించారు.

పారిశుధ్య పనుల నిర్వహణ నిరంతర ప్రక్రియ

కాసిపేట, సెప్టెంబరు 12: పారిశుధ్య పనుల నిర్వహణ నిరంతర ప్రక్రియ అని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం కొండాపూర్, ధర్మారావుపేట, తాటిగూడ పంచాయతీల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ ఆలీ, ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

బెల్లంపల్లి, సెప్టెంబరు 12: సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం కాల్‌టెక్స్ బ్రిడ్జిపై బైక్‌ల షోరూంల యజమానుల సహకారంతో ఏర్పాటు 6 సీసీ కెమెరాలను ఏసీపీ ప్రారంభించారు. సీసీ కెమెరాలున్న ప్రాంతాల్లో నేరస్తులు నేరాలు, దొంగతనాలు చేయడానికి భయపడతారని తెలిపారు. సీఐ అఫ్జలుద్దీన్, ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, సెప్టెంబరు 12: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి నవరాత్రుల మరమ్మతుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు ఎంపిక పోటీలు

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 12: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మాజ్యోతి బాపూలే జూనియర్ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి మారయ్యలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్ 14, 16, 18, 20 బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు మైదా నానికి రావాలని కోరారు.

ఈ నెల 17న నిమజ్జనం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12: మంచిర్యాల పట్టణంలో ఈ నెల 17న అనంత పద్మనాభ చతుర్ధశి రోజున వినాయక నిమజ్జనం నిర్వహించడానికి హిందూ ఉత్సవ సమితి నిర్ణయించిందని సమితి నాయకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖం డేల్‌వాల్ భవనంలో సాయంత్రం 5.30 గంటలకు సమావేశం జరుగుతుందని, మండపాల నిర్వాహకులు ఇద్దరు చొప్పున హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, సీపీ, మున్సిపల్ కమిషనర్లు హాజరవుతారని తెలిపారు. దీపేష్ రైన్వా, రవీందర్, కృష్ణ భాస్కర్, సత్యపాల్‌రెడ్డి, హరికృష్ణ, పద్మ, పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

హాజీపూర్, సెప్టెంబరు 12: రాపెల్లి, గుడిపేట గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండేలు పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అధికారులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12: సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సందర్శించారు. పోషన్ అభియాన్ కార్యక్రమంపై సమీక్షించారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు పోషన్ అభియాన్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలన్నారు. పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు అనిత, ఫయాజ్, రాము, రజిత, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, సీడీపీవో పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 12: మహిళా సాధికారతతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాత ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. క్యాంటీన్‌లు, మిల్క్‌పార్లర్లు, రైసుమిల్లుల నిర్వహణ బాధ్యతలను ఐకేపీకి అప్పగించిందన్నారు. మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు తీసుకుని వ్యాపార రంగంలో రాణించాలన్నారు. క్యాంటీన్‌లో క్వాలిటీ ఫుడ్ మెయింటెన్ చేయాలన్నారు. మహిళా సంఘాల్లో అందరూ చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. అంతకుముందు ఉత్కూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళ శక్తి మిల్క్ పార్లర్‌ను ప్రారంభించారు. డీఆర్‌డీవో కిషన్, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్ రావు, స్పెషల్ ఆఫీసర్ స్వప్న, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో సరోజ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటరమణ, ఏపీఎం లక్ష్మీ, పాల్గొన్నారు.



మిల్క్ పార్లర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

మహిళ సంక్షేమంలో భాగంగా గ్యాస్ రాయితీ

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వం మహిళ సంక్షేమంలో భాగంగా గ్యాస్ రాయితీ కల్పిస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతిలో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు గ్యాస్‌పై అందిస్తున్న రాయితీపై లబ్ధిదారులకు అర్హత, రాయితీ నగదు వివరాలు తెలియజేసే పత్రాలను అందిస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ పొందిన నాలుగు రోజుల్లో రాయితీ నగదు జమ కాకపోతే వివరాల కోసం 1967, 180042500333 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. గ్యాస్ రాయితీ సంబంధిత పత్రాలను రేషన్ డీలర్లు, కార్యదర్శులు, వార్డు అధికారుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

అక్షరాస్యతతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

కాసిపేట: అక్షరాస్యత ద్వారా మహిళల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నా రు. ధర్మారావుపేట, మల్కేపల్లి గ్రామాల్లో జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్‌క్లబ్ సఖి సంయుక్త ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కేంద్రాలు, ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. చేసే పనిని ప్రణాళికబద్ధంగా చేస్తే విజయవంతంగా పూర్తి చేయవచ్చన్నారు. అక్షరాస్యత కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులను వంద రోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అక్షరాస్యతతోపాటు స్వయం ఉపాధికి కుట్టుశిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కుట్టుశిక్షణ నేర్చుకున్న వారు మంచి ఉపాధి పొందవచ్చని తెలిపారు. మంచిర్యాలను వంద శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, లీడ్ బ్యాంకు డిస్టిక్ మేనేజర్ తిరుపతి, డివిజనల్ పంచాయతీ అధికారి సప్దర్ ఆలీ, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, సెక్టార్ అధికారి సత్యనారాయణమూర్తి, లయ న్స్‌క్లబ్ సఖి అధ్యక్షురాలు శాంకరి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి




విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

భీమిని, సెప్టెంబరు 12: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. గురువారం భీమిని ఉన్నత పాఠశాల, భీమిని, బిట్టూరుపల్లి, మామిడిగూడ, పెద్దపేట, భీమిని ఎస్సీ కాలని, భవిత కేంద్రాలను తనిఖీ చేశారు. భీమిని ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వి.రమేష్, భీమిని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఐ.విజయ, పి.స్వాతిలు పాఠశాలకు ఆలస్యంగా రావడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయా పాఠ శాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పరీక్షలు అంటే భయం వద్దని ప్రతీ సబ్జెక్టును అర్థం చేసుకో వాలన్నారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఏ విధంగా విద్యను బోధిస్తున్నారు. ప్రతీ వారం ఫిజియోథెరపీ వైద్యం నిర్వహిస్తున్నారా అని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి చౌదరి లు ఉన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 12: మోదల గ్రామంలో గురువారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈ గణేష్ తన సిబ్బందితో వంగిన స్తంభాలను గుర్తించారు. వీటిని సరి చేస్తామని తెలిపారు. మోటార్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ నర్సింగరావు, ఎల్ఐ లక్ష్మణ్, లైన్‌మెన్‌మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టవద్దని ధర్నా




ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నస్పూర్, సెప్టెంబరు 12: పట్టణంలోని సర్వే నంబరు 42లో టీఎన్‌జీవో కాలనీకి కేటాయించిన ప్లాట్లలో అవకతవకలపై విచారణ జరుగుతున్నందున నిర్మాణ పనులను ఆపి వేయాలని గురువారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బాధితులు, రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ చిట్యాల సతీష్‌కు అందజేశారు. అధికారులు ఇంటి అనుమతులు ఇచ్చేముందు ఫైనల్ పట్టాలో ఉన్న హద్దులతో సరి చూసి వ్యత్యాసం ఉంటే నిర్మాణ పనులు ఆపి వేయాలని కోరారు. తమ ప్లాట్లు లేకుండా చేశారని ఆరోపించారు. సొసైటీలో ప్రభుత్వ ఉద్యోగులే పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నాలో తులా మధుసూదన్‌రావు, నహీం పాషా, పోచయ్య, ఖుర్షిద్ అహ్మద్, బషీర్ అహ్మద్, డి.రాజయ్య, అబ్దుల్ నబీ, బోసు, మల్లయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

హోమియోపతి వైద్య శిబిరం

మంచిర్యాల , సెప్టెంబరు 12: మంచిర్యాలలోని చున్నంబట్టివాడలో అంజనిపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ సహకారంతో డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మోతిలాల్ మందులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ హోమియోపతి మందులతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్యులు మాట్లాడుతూ హోమియోపతిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స ఉందన్నారు. అంజనిపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి, డైరెక్టర్‌లు సురేష్ శ్రీనివాస్, కుమార్, వైద్యుడు మల్లేష్, మేనేజర్ రజిత, శంకర్‌సింగ్, గీత పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 12: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 9 పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసి పనులను ప్రారంభించాలని పేర్కొన్నారన్నారు. ఆదిలాబాద్, బెల్లంపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పి చేయడం లేదన్నారు. కళాశాలను అప్‌గ్రేడ్ చేయకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. నాయకులు శేఖర్‌నరేష్, శ్రావణ్, సతీష్‌రమేష్, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 12 : బెల్లంపల్లిలో నిర్మించిన వెజ్, నాన్ వెజ్ కూరగాయల భవనంలో షాపులను వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవనంలో ఇంతకుముందు ఒక్క స్టాల్‌కు డిపాజిట్ రూ. 20 వేలు, నెలకు అద్దె రూ. 2 వేల చొప్పున తీర్మానించామన్నారు. ఎవరూ రాకపోవడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్టాల్‌కు డిపాజిట్ రూ.10 వేలు, అద్దెకు రూ.2 వేల చొప్పున తీర్మానించామన్నారు. ఈ నెల 16లోగా ఆసక్తి గల వారు బాండ్ పేపర్‌పై అగ్రిమెంటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16లోపు రూ.10 వేల డిపాజిట్ చెల్లించకపోతే వారి స్థానంలో వేరే వారికి స్టాల్ కేటాయిస్తామని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 12: పాతబస్టాండ్ మారుతినగర్‌కు చెందిన బి. వెంకటేశ్వర్లు ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 8,500 నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ పేకాట ఆడుతున్న అంగడిబజార్‌కు చెందిన అనిల్‌కుమార్, రవికుమార్, పాత బస్టాండ్‌కు చెందిన సంతోష్, సత్యం, రాజు, శాంతినగర్‌కు చెందిన శంకర్, మార్కెట్ ఏరియాకు చెందిన రవికిరణ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

జైపూర్: మండలంలోని ఇందారం శివారులోని ఓ వెంచర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు గురువారం పేకాటరాయుళ్లను పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఇందారంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి చూడగా పేకాట ఆడుతున్న నోముల రవీందర్, రామగిరి రాజలింగు, దుగ్యాల మొండయ్య, లక్ష్మణ్, మహ్మద్ నాసిర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరందరు గోదావరిఖని పట్టణానికి చెందిన వారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 9480 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లక్షెట్టిపేటరూరల్: లక్షెట్టిపేట పట్టణంలో ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు యువకులకు సీఐ అల్లం నరేందర్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ పేకాట ఆడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మళ్లీ పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్‌ఐ సతీష్ ఉన్నారు.

రామకృష్ణాపూర్: గతంలో పేకాట ఆడిన పది మంది జూదరులను రామకృష్ణాపూర్ పోలీసులు గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

తాండూర్, సెప్టెంబర్ 12: మండలంలోని పలు డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. అనంతరం అచ్చలాపూర్ లోని గణపతి మండపాలను పరిశీలించి శోభాయాత్రలో తీసుకోవలసిన జాగ్రత్తలను వారికి వివరించారు. డీజేలు అనుమతులు లేనందున ఎవ్వరూ డీజేలు పెట్టుకోవద్దని సూచించారు.

భీమిని: మండలంలోని డీజే సిస్టమ్ నిర్వాహకులను గురువారం తహసీల్దార్ బికర్ణ దాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. నియమాలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం మత్తులో చెరువులోకి దిగి వ్యక్తి మృతి

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 12: బెల్లంపల్లి బస్తీకి చెందిన పోతురాజుల నర్సయ్య (60) అనే రిటైర్డు సింగరేణి కార్మికుడు మద్యం మత్తులో పోచమ్మ చెరువులో దిగి మృతి చెందాడు. నర్సయ్య పోచమ్మ చెరువులో పూలు తెంపుకుని బెల్లంపల్లి బజారులో అమ్మి డబ్బులతో మద్యం తాగేవాడు. ఈ నెల 11న ఉదయం పూల కోసం పోచమ్మ చెరువుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మీ తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు గాలిస్తుండగా గురువారం పోచమ్మ చెరువులో శవమై అగుపించాడు. మృతుడు పూలు అమ్ముకున్న డబ్బులతో మద్యం సేవించి మళ్లీ పూల కోసం మద్యం మత్తులో చెరువులోకి దిగడంతో నాచు కాళ్లకు చుట్టుకుని మృతి చెందాడని విచారణలో తేలినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 12: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎ జోన్ రాంనగర్‌లో తేజశ్రీ(33) వివాహిత ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త రాజ్‌కుమార్, అక్క జి శారద, బావ కనకయ్య, అమ్మ కనకమ్మ మానసికంగా వేధించేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన

భీమారం, సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను గురువారం ఎస్‌ఐ రాములు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తిని ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. రోడ్ల పక్కన ఏర్పాటు చేస్తున్న లైట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నిమజ్జనానికి పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అందరు సహకరించాలని కోరారు. ఆర్‌ఐ స్రవంతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల కమిటీ ఎన్నికలు

కాసిపేట, సెప్టెంబరు 12: మండలంలోని ఆశ్రమ గిరిజన పాఠశాలలో గురువారం విద్యార్థులకు కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఫుడ్ కమిటీ, విద్యా కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఓటు హక్కు ద్వారా కమిటీ కెప్టెన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి



కావ్య (ఫైల్)

కాసిపేట, సెప్టెంబరు 12: స్టేషన్ పెద్దనపల్లికి చెందిన మూడెడ్ల కావ్య (26) అనే బాలింత అనుమానాస్పదంగా మృతి చెందింది. అదే గ్రామానికి సాయి కిరణ్‌తో కావ్యకు 2019లో ప్రేమ వివాహం జరిగింది. ఈనెల 5న బెల్లంపల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. అనంతరం 8న ఇంటికి వచ్చింది. ఈ నెల 11న ఆరోగ్యం బాగాలేదని మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు పేర్కొన్నారు. కావ్య మృతిపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు ఐలవేని సాయి రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సీతారాం ఏచూరీ మరణం తీరని లోటు

బెల్లంపల్లి, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరీ మరణం ప్రజలకు తీరని లోటని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సబ్బని కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు దశాబ్దాల క్రితం సీపీఐ పార్టీలో చేరి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేశారని తెలిపారు. ఆయన మరణం తీరని లోటని తెలిపారు.

పంటల పరిశీలన

మందమర్రిరూరల్, సెప్టెంబరు 12: అందుగులపేట గ్రామంలో గురువారం ఏవో కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజులు మిరప, పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేన్లలో నీరు చేరిందని, నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

గణనాథుడికి అదనపు కలెక్టర్ పూజలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో అంజనిపుత్ర రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండలంలో గురువార అదనపు కలెక్టర్ మోతిలాల్ పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. గుర్రాల శ్రీధర్, కిషన్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

అమృత కలశంతో చేయూత

దండేపల్లి, సెప్టెంబరు 12: దండేపల్లి గ్రామానికి చెందిన ముష్కే సత్తవ్వ, పెండ్యాల లావణ్య నిరుపేద మహిళలకు ద్రాక్షపతి వజ్రమ్మ బుచ్చయ్య ఆధ్వర్యంలో గురువారం అమృత కలశంను పంపిణీ చేశారు. రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు. రాపర్తి రాజన్న, పుసుపునూటి సత్తయ్య, తాళ్ళ కుమారస్వామిగౌడ్, ప్రేమ్‌సాగర్, రాధకృష్ణ కట్ట చారి పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులకు జరిమానా

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 12: దాడి కేసులో జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి అర్పితమారంరెడ్డి గురువారం జరిమానా విధించారని ఎస్‌ఐ సతీష్ తెలిపారు. మోదెలకు చెందిన బండి రాంచందర్, రంజిత్, లచ్చయ్యలు 2019 ఆగస్టు 4న ఇంటి వెనుక మరుగుదొడ్డి నిర్మాణం చేపడుతున్నారు. లక్షెట్టిపేటకు చెందిన వేముల ఈశ్వరయ్య, రమేష్, రాకేష్, మధులు కర్రలతో దాడి చేయగా లచ్చన్న తలకు గాయాలయ్యాయి. బండి రాంకుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేశాడు. దాడికి పాల్పడిన వేముల ఈశ్వరయ్య మృతి చెందగా ముగ్గురిలో ఒకరికి రూ.20 వేలు, మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దండేపల్లి, సెప్టెంబరు 12: లింగాపూర్ గ్రామానికి చెందిన భానవత్ గణేష్(42) అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గణేష్ కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అప్పు చేసి వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది పొలంలో గడ్డి మందు తాగి పడిపోయాడు. గురువారం ఉదయం వెళ్లిన గణేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు వినేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

భీమారం, సెప్టెంబరు 12: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులను మండల స్పెషల్ ఆఫీసర్ కల్పన పరిశీలించారు. రోజు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేయించాలని కార్యదర్శులకు సూచించారు. పనుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, కార్యదర్శులుకృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్నాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయినగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలే దని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 12: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకవిలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదనపుకలెక్టర్ దాసరివేణు అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని గురుకులపాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో విద్యార్థుల ఆరోగ్యపరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, సెప్టెంబరు 12: వినాయక నిమజ్జన కార్యక్రమానికి పూర్తి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. గురువారం కాగజ్‌నగర్ పెద్దవాగులో నిమజ్జనస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనకార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్‌సిల్క్ కాలనీలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. జ్వరాలుప్రబలకుండా చూడాలన్నారు. వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమెవెంట మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎస్సై మహేందర్ తదితరులున్నారు.

గణేషుడికి 108రకాల ప్రసాదాలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 11: గణేష్‌నవరాత్రుల్లో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, శ్రీవాసవీకన్యాకపరమేశ్వరి శివపంచాయతన క్షేత్రంలో గురువారం 108రకాల ప్రసాదాలతో గణేషుడికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.





మండపాల్లో గణేషుడికి సమర్పించిన నైవేద్యాలు

నూతన భవనాలకు మోక్షమెప్పుడో?

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు

ఏళ్లు గడుస్తున్నా అద్దె భవనాలు, శిథిల భవనాలే దిక్కు



చింతలమానేపల్లిలో ప్రభుత్వ పాఠశాల రెండో అంతస్తులో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

చింతలమానేపల్లి, సెప్టెంబరు 12: ప్రజలకు పాలనాపరంగా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాతోపాటు చింతలమానేపల్లి, పెంచికలపేట, లింగాపూర్ మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర శాఖల కార్యాలయాలకు భవనాలు నిర్మించాల్సి ఉన్నా ఇప్పటివరకు వాటి నిర్మాణాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికీ ఆయామండలాల్లో శిథిల భవనాలు, అద్దె భవనాల్లోనే పనులు నిర్వహిస్తున్నారు. గదులు కూడా పూర్తిగా ఇరుకుగా ఉండడం, శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో నన్న ఆందోళన అటు ఉద్యోగుల్లో, ఇటు ప్రజల్లో ఉంది. ఆయా మండలాలకు వచ్చిన ప్రతీసారి ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన భవనాల కోసం కృషి చేస్తామని హామీ ఇస్తున్నప్పటికీ నెరవేర్చడం లేదు. నూతన భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలందేలా చూడాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.



లింగాపూర్ జీపీ ఆఫీసులో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

జిల్లాలో 3 మండలాల ఏర్పాటు..

జిల్లాలో కొత్తగా మూడు మండలాలు ఏర్పాటుచేశారు. ఇందులో చింతల మానేపల్లి మండలంలో సుమారుగా 22వేల పైచిలుకు జనాభా ఉండగా, 19 గ్రామ పంచాయతీలున్నాయి. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పాత ప్రభుత్వపాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. అది కూడా పైఅంతస్థులో ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు వృద్ధులు ప్రయాసపడుతున్నారు. అదే విధంగా ఎంపీడీవో కార్యాలయం ప్రభుత్వ పాఠశాలలోనే నిర్వహిస్తుండగా అది పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఆరు నెలల క్రితమే ఓ పక్క కార్యాలయం పెచ్చులూడింది. అలాగే వ్యవసాయ, విద్యా శాఖకు సంబంధించిన కార్యాలయాలు లేవు. పోలీస్‌స్టేషన్‌కు భవనం నూతనంగా నిర్మించడంతో ఇబ్బంది లేకుండా ఉంది. స్త్రీ సమాఖ్య భవనం ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగుతోంది. పూర్తి కార్యాలయాలు నిర్మించాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెంచికలపేట మండలంలో..

పెంచికలపేట: నూతనంగా ఏర్పాటైన పెంచికలపేట మండలంలో తహసీల్దార్ కార్యాలయం ఆరె సంక్షేమ సంఘం భవనంలో కొనసాగుతోంది. ఎంపీడీవో కార్యాలయం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతుండగా వ్యవసాయాధికారులు రైతు వేదికలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అటవీశాఖ కార్యాల యం బీట్ ఆఫీసర్ వసతిగృహంలో కొనసాగుతోంది. పోలీసు స్టేషన్, ఎంఆర్సీ భవనం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం భవనాలను నూతనంగా నిర్మించి ఇటీవలే ప్రారంభించారు. మండలఏర్పాటుకు పూర్వం నుంచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల వైద్యశాలలు ఉన్నాయి.

లింగాపూర్ మండలంలో..

లింగాపూర్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం పాత జడ్పీఎస్ఎస్ పాఠశాలలో, ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యాలయం కొనసాగుతున్నాయి. అటవీశాఖ కార్యాలయం వీఎస్ఎస్ కమ్యూనిటీహాల్‌లో, వ్యవసాయశాఖ రైతువేదికలో కొనసాగుతున్నాయి. ఎంఆర్సీ భవన నిర్మాణం పూర్తైనా ఇంకా ప్రారంభించలేదు. మండలం ఏర్పడడానికి ముందే పోలీసు స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

పూర్తి కార్యాలయాలు ఏర్పాటు చేయాలి..



అగాది సుధాకర్, కర్జెల్లి

ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లో పూర్తికార్యాలయాలు, అలాగే పూర్తిస్థాయిలో అధికారులను నియమిస్తే మండలాలు అభివృద్ధి చెందుతాయి.

ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు: కలెక్టర్



కెరమెరిలో వైద్యశిబిరంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 12: సీజనల్‌వ్యాధులను నియంత్రించడంలో భాగంగా జిల్లాలోని అన్నిగ్రామాల్లో ప్రత్యేకవైద్యశిబిరాల ద్వారా వైద్యసేవలు అందిస్తామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 10నుంచి23వరకు గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు కార్యచరణ రూపొందించామన్నారు. ఈనెల 12వరకు జిల్లాలో 241వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయాప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో తగిన మందులు అందుబాటులో ఉంచుకుని, అందించిన సేవలు, నిర్వహించిన పరీక్షలు ఇతరపూర్తి వివరాలతో నిర్ణీత ప్రొఫార్మాలో నివేదిక అందించాలని తెలిపారు.

గిరి ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవల దిశగా చర్యలు

జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తుకారాంభట్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకుడు చెన్నకేశవతో కలిసి ప్రధానమంత్రి జన్‌మన్‌లో భాగంగా ఒప్పంద పద్ధతిన మొబైల్‌మెడికల్ యూనిట్ ద్వారా అయిదుగురు వైద్యులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనప్రాంతాల్లో ముఖ్యంగా పీవీటీజీలు నివస్తున్న గ్రామాల్లో మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాల ద్వారా వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి: సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం ఆయన మండలంలోని కోటారి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జ్వరాలు, మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఓటరు జాబితా గ్రామస్థుల ముందు చదివి సంబంధిత గ్రామస్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో అంతర్గత సీసీరోడ్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పారిశుధ్య పనులను పరిశీలించి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీచేశారు. పనుల నిర్వహణ రిజిస్టర్, ఫాగింగ్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అలాగే పాఠశాలను తనిఖీచేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతి గౌడ్, డీఎంహెచ్‌వో తుకారాం భట్, ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, నోడల్ అధికారి ప్రకాష్, ఏపీవో మల్లయ్య, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

సిర్పూర్(టి), సెప్టెంబరు 12: మండలంలోని వెంకట్రావుపేట గ్రామరోడ్డుపై బుధవారం రాత్రి గణేష్‌చందా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న ఆరుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయనతెలిపినవివరాల ప్రకారం.. కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన హీవార్కర్ శంకర, అతని మిత్రుడు దంద్రి బాలాజీ చందాపూర్ ఆసుపత్రికి వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో వెంట్రావుపేట గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దంద్రీ విజయ్, దంద్రీ సాగర్, దంద్రీ మురళీ, దంద్రీ మిథన్, ఆమ్లె విజయ్, దంద్రీ ఈశ్వర్ ఆపి గణేష్ చందా పేరు చెప్పి బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై..

చింతలమానేపల్లి, సెప్టెంబరు 12: మండలంలోని రన్‌వెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మారుతి విధులు నిర్వహిస్తున్న సమయంలో అదేగ్రామానికి చెందిన జాటోత్ దేవ్‌సింగ్ విధులకు ఆటంకం కలిగించి అసభ్యపదజాలంతో దూషించాడు. ఈ మేరకుకార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుమేరకు దేవ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు



కాగజ్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయకార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరనిలోటని పలువురు పేర్కొన్నారు. గురువారం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి కూశనరాజన్న, టీయూడబ్ల్యూజే ఐజేయూజిల్లా అధ్యక్షుడు రహెమాన్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని ఉరితీయాలి

సిర్పూర్(టి)/కౌటాల/బెజ్జూరు/వాంకిడి/కెరమెరి, సెప్టెంబరు 12: జైనూరు మండలంలో గిరిజనమహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని ఆదివాసీగిరిజన రాష్ట్రనాయకులు గంటగోపాల్ ఆధ్వర్యంలో గురువారం సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై కమలాకర్‌కు, బెజ్జూరు సీఐ రమేష్‌కు మహిళలు ఫిర్యాదులు చేశారు. వాంకిడిలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళలు ర్యాలీనిర్వహించారు. ధర్నాచేసి తహసీల్దార్ రియాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కెరమెరి మండల కేంద్రంలో పలుగ్రామాలకు చెందిన ఆదివాసీ మహిళలు ఆదివాసీభవన్ నుంచి పోలీసుస్టేషన్‌వరకు నిరసనర్యాలీ చేపట్టి ఎస్సై విజయ్‌కి వినతిపత్రం అందజేశారు.

కాగజ్‌నగర్‌లో హాల్ట్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, సెప్టెంబరు 12: నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్యత్వరలో నడువనున్న వందేభారత్ రైలుకు కాగజ్‌నగర్‌లో హాల్టుకల్పించాలని గురువారం దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన జీఎం హాల్టుఇచ్చేందుకు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు.

పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 12: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం ఎల్లారం, జన్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లాసంక్షేమశాఖాధికారి భాస్కర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూప్రకారం పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మరమ్మతు పనులు వేగంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా షెడ్యూల్డ్‌కులాల సంక్షేమశాఖాధికారి సజీవన్‌తోకలిసి జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాలసంక్షేమశాఖ వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూప్రకారం ఆహారంఅందించాలని, వారి ఆరోగ్యస్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు.

జిల్లాలో ప్రత్యేక వైద్యశిబిరాలు..

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. గురువారం జిల్లాలో ఏర్పాటు చేసిన పలు వైద్యశిబిరాలను పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా సంబంధిత శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా చర్యలు తీసుకుంటామన్నారు. జ్వరలక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యసేవలు పొందాలని తెలిపారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

30పడకల ఆస్పత్రిని నిర్మించాలి: టీబీజీకేఎస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 12: శ్రీరాంపూర్‌లోని ఆర్కే8డిస్పెన్సరీలో 30పడకల ఆస్పత్రిని నిర్మించాలని టీబీజీకేఎస్ రాష్ట్రప్రధానకార్యదర్శి కె సురేందర్‌రెడ్డి యాజమాన్యాన్ని కోరారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఏరియాలోని గనులు, విభాగాల్లో సుమారు 10మంది పర్మినెంట్ కార్మికులు, 10వేలకుపైగా కాంట్రాక్టుకార్మికులు పనిచేస్తున్నారన్నారు. నస్పూర్, ఆర్కే8 డిస్పెన్సరీలలో కార్మికులతో పాటు వారి కుటుంబసభ్యులకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆర్కే8డిస్పెన్సరీ గనులు, విభాగాలకు సమీపంలో ఉందన్నారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే అక్కడికి తీసుకువెళ్లి అనంతరం ఏరియాఆస్పత్రికి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సరైన సమయంలో వైద్యం అందకచాలామంది మృత్యువాత పడుతున్నారని ఆవేదనవ్యక్తంచేశారు.30పడకలఆస్పత్రి నిర్మించి, క్రిటికల్‌కేర్ పరికరాలు, సరిపోయినంత వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచినట్లయితే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యాజమాన్యంవెంటనే స్పందించి 30పడకల ఆస్పత్రి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.



సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జైపూర్, సెప్టెంబరు 12: సింగరేణి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సేఫ్టీ కార్పొరేట్ జనరల్‌మేనేజర్ చింతలశ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీజనరల్ మేనేజర్ రఘుకుమార్‌తో కలిసి ఇందారం ఓపెన్‌కాస్టును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణే ప్రథమం, రక్షణే ఎల్లప్పుడు, రక్షణే చివరివరకు అనేనినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. సింగరేణి కార్మికుల రక్షణకు యాజమాన్యం మొదటి ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

పోరుబాట కరపత్రాల విడుదల

రెబ్బెన, సెప్టెంబరు 12: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పోరుబాట కరపత్రాలను గురువారం స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెలలో పోరుబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లాభాల వాటా వెంటనే చెల్లించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 12: సింగరేణిలో కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటా 35శాతం చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కార్యదర్శి సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం ఏరియావర్కుషాపులో వారు మాట్లాడారు. కార్మికులఆలోచనలకు అనుగుణంగా తాముపనిచేస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి టర్మినల్ బెనిఫిట్స్ అందించాలి: హెచ్ఎంఎస్

జైపూర్, సెప్టెంబరు 12: మృతుడు శ్రీనివాస్‌కు చెందాల్సిన టర్మినల్ బెనిఫిట్స్‌ను వెంటనే అందించాలని హెచ్ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. బుధవారం ఐకే1ఏ గనిలో మృతిచెందిన కార్మికుడు శ్రీనివాస్‌కు సంతాపంగా నాయకులు, కార్మికులు, అధికారులు రెండు నిమిషాలు మౌనంపాటించి నివాళులర్పించారు. ఆయనమాట్లాడుతూ మృతుడి కుటుంబంలో ఒకరికి సూటబుల్ జాబ్ ఇవ్వాలనికోరారు. విచారణపేరుతో చనిపోయిన రోజు శ్రీనివాస్‌తో పనిచేసిన తోటి కార్మికులను ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సమగ్రమైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గుర్తింపు సంఘం పిట్‌కార్యదర్శి నవీన్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ పిట్‌కార్యదర్శి రాంచందర్, సీఐటీయూ బ్రాంచ్‌కార్యదర్శి అంబాల శ్రీనివాస్, టీబీజీకేఎస్ పిట్‌కార్యదర్శి మల్లన్న, బీఎంఎస్ పిట్‌కార్యదర్శి లక్ష్మణ్, అధికారులు నాగరాజు, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

రెబ్బెన, సెప్టెంబరు 12: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడఓపెన్‌కాస్టులో ఈపీ ఆపరేటర్లకు వెకెన్సీ నెపంతో ఖాళీలు లేవని ప్రమోషన్లు ఇవ్వకుండా తిప్పిస్తున్నందుకు నిరసనగా గురువారం వివిధసంఘాల నాయకులు, ఈపీ ఆపరేటర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. లేని పక్షంలో పోరుబాటు పడుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్, బీహెచ్ఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 12:ఆర్థిక సంవత్సరం (2022-23)కి చెందిన సీఎంపీఎఫ్ చిట్టీలను గనులు, విభాగాలకు చేరవేసినట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా చిట్టీలను గనులు, విభాగాల వారీగా పనిచేస్తున్న 9,369 మంది కార్మికులకు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అందరికీ సమానంగా లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 12: భూగర్భగనుల్లో పనిచేస్తున్న కార్మికులతో సమానంగా ఓసీపీలో పనిచేస్తున్న కార్మికులకు లాభాలవాటా ఇవ్వాలని అన్ని కార్మికసంఘాల నాయకులు కోరారు. ఉపరితల గనులలో పనిచేసే ఉద్యోగులు ఉత్పత్తికి వెన్నెముకలా నిలుస్తున్నారని, వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ పిట్‌కార్యదర్శి శ్రీపతిబానేష్, ఏఐటీయూసీ పిట్‌కార్యదర్శి మోతెలచ్చన్న, ఐఎన్‌టీయూసీ పిట్‌కార్యదర్శి జాన్సన్, హెచ్ఎంఎస్ నాయకుడు జీవన్‌జోయల్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి కందుల శంకరయ్య, బీఎంఎస్ పిట్‌కార్యదర్శి నీలం శ్రీనివాస్, ఈపీ ఆపరేటర్లు, ఓసీపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, సెప్టెంబరు 12: సింగరేణిలో అప్రెంటిషిప్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, పీఎం శ్యాంసుందర్ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులై, నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగినవారు, ఇంటర్మీడియెట్‌లో ఒకేషనల్ కోర్సు చేసిన వారు ఈనెల23వతేదీలోగా www.apprenticeshipindia.org, www.scclmines.com/apprenticeship ఏదైనా ఒక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలతో ఆయా ఏరియాల్లోని వృత్తి శిక్షణ కేంద్రాల్లో అందజేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

ఆసిఫాబాద్: ఖమ్మంజిల్లాలో భారీవర్షాలకారణంగా మున్నేరువరద బాధితుల సహాయార్థం గురువారం డీవైఎఫ్ఐఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు టీకానంద్,కార్తీక్, మాలశ్రీ, నిఖిల్, సతీష్‌పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ ప్రభుత్వఆసుపత్రిలో మూడునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని గురువారం ఆసుపత్రి ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, మురళీ, సత్తార్, మమత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్: ఈనెల19, 20తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయిజూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 30మందికి ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, కోట్నాక విజయ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలుర కళాశాలలో మిగిలిఉన్న సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీలో 15సీట్లు, ఎంపీసీలో 15సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఆసిఫాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్‌హ్యాండ్లూమ్ టెక్నాలజీకి పద్మశాలీల ఆశాదీపం, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టడంపై హర్షంవ్యక్తంచేస్తూ గురువారం పట్టణంలో పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

అలరించిన కవి సమ్మేళనం

ఆసిఫాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలోని వాసవీమందిర్‌లో గురువారం ఆసిఫాబాద్ కవుల సంఘం ఆధ్వర్యంలో వినాయకచవితిపై నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. కవితలతోపాటు పలుభక్తిగీతాలుఆలపించారు. కార్యక్రమంలో చిన్నారులు శ్రీవాసవీ, సహనల స్వాగతనృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్యఫెడరేషన్ జిల్లాఅధ్యక్షుడువెంకన్న, ఆలయకమిటీ అధ్యక్షుడు శంకర్,వెంకటేశ్వర్,శంకర్, ఇశంకర్,ఆకసం అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్, వెలిగిగ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న పదిమంది నుంచి రక్తనమునాలు సేకరించారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

దహెగాం: మండలకేంద్రానికి చెందిన యువకులు గురువారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. సిమెంట్,కాంక్రీట్‌కలిపి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

కాగజ్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిఠల్‌ను గురువారం కాగజ్‌నగర్‌కు చెందిన నాయకులు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు సముద్రాల సరితరాజన్న కలిశారు.

కల్యాణ లక్ష్మి చెక్‌ల పంపిణీ

రెబ్బెన: మండలంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకంతో ఎంతో మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

రెబ్బెన: గోలేటిలోని భీమన్న క్రీడామైదానంలో 91వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా బాస్కెట్‌బాల్ డిపార్టుమెంటల్ క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలను డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు.